# యానగాలి

రోహిణీ కార్తె ఎండలు. రోళ్ళు బ్రద్దలవటం కాదు , ఊళ్ళు కాల్తున్న వేడి !

కళింగ తీర ప్రాంతంలో - వేసవి అంతగా అన్పించదు. వంశధారా, నాగావళి నదుల మీదుగా 'పడమటి రివ్వ' వొకవైపూ, బంగాళాఖాతం మీదుగా 'యానగాలి' మరోవైపూ వీచి - వేసవి తాపాన్ని చల్లారుస్తాయి. గానీ యీ యేడాది మాత్రం - కళింగతీరమూ కాల్తున్న పెనంలా వుంది !

సరళమ్మ దీర్ఘంగా ఆలోచిస్తూ కూర్చుంది. మూడేళ్ళుగా సాగుతున్న ఘర్షణ ఒక్కోసారి సమసి పోయి, కొద్దినాళ్ళకే మళ్ళీ మరోరూపంలో..! ఎన్నాళ్లిలా .... యీ ఉద్యోగం ? ఉద్యోగంలోనా .... సంసారంలోనా .... సాగుతున్నది ఘర్షణే !

" పోలిగా,పోలిగా ఒక పలుకు పలుకురా అంటే -నల్లరాయి కింద నలుగురు దొంగలన్నాడట ! గొప్పమాట చెప్పావురా - యింత సేపటికి నోరిప్పి .... " ఎగతాళిగానూ, చిరాగ్గానూ పలికింది గున్నమ్మ.

ఎమ్డీవో సరళమ్మ డీలా పడిపోకుండా - యేమైనా ధైర్యవచనాలు చెప్పాలని వుంది గున్నమ్మకు.

ఆమె మాటలకు గవరయ్య ఆమెవైపు కొరకొరా చూసి , యేదో అనబోయి - మళ్ళీ అందుకు యే సామెత పొడుస్తుందోనని బయపడి - మౌనం దాల్చేడు.

గున్నమ్మకు యేదో చెప్పాలని వుంది గానీ, యేమీ మాట్లాడలేక పోయింది. గవరయ్యను గుసురుకున్నాక - ఆమె గూడా క్షణకాలం మౌనంగా వుండిపోయింది.

సరళమ్మ - మనసులో మధనపడే విషయాన్ని మర్చిపోయి, - గున్నమ్మని, గవరయ్యనీ చూడసాగింది. మూడేళ్ళుగా తనతో కలసి నిల్చినవాళ్ళు .... యీ యిద్దరేనా ? ఈ యిద్దరిలో గూడా - ఐక్యత లేదన్నట్లుగా - వాళ్ళ సంభాషణ...

" ... మీకు తిన్ననైంది మీరు సెయ్యండమ్మా. అధికారం సేతిల వున్నోళ్ళు, మీ కడ్డేటి" ? ధైర్యం చెప్తోందో కర్తవ్యం బోధిస్తోందో - గున్నమ్మ.

సరళమ్మ తన చేతిలో వున్న అధికారాన్ని విశ్లేషించుకుంది.రాష్ట్ర పంచాయితీరాజ్ మంత్రి ఆధీనంలో - చీఫ్ శక్రటరీ స్ధాయినుండి మండలస్ధాయి వరకూ గల - అధికారపు నిచ్చెన మెట్లలో - తన స్ధానం ఆరంభ మెట్టు .. ! సరే , ఆ మెట్టుమీదన్నా ధృఢంగా నిలబడుగలుగుతున్నానా ? నిల్చోనిస్తున్నారా ... ?

" పేరు సరళనీ సరళరేఖలాగ సాగిస్తాను పవర్లు అంటే కుదర్దు. ఇది ప్రజల గవర్నమెంటు . గవర్నరుకే సాగదు ..... "

అలాంటి మాటలే , యింకా ఎన్నో రాజేశ్వర్రావు నోటివెంట ..మండలాధ్యక్షులవారి చాంబర్‌లో !

నిన్నటి సమావేశమంతా గుర్తొస్తోంది సరళమ్మకు.

ఎమ్డీవోను హెచ్చరించే బలమూ, ఎమ్డీవో అధికారాన్ని సమీక్షించే పవరూ - రాజేశ్వరరావూ నీ కెక్కడిది ? నువ్వెవరు ?

సరళమ్మ మనసులో యీ రూపంలో ప్రశ్నలు వేసుకోలేదు, గానీ ఆమె ఆలోచనల సారాంశమదే ... ఆ క్షణాన !

పోనీ , యీ ప్రశ్నలు - ఆమెకో .... ? శాంతామణికో - మనసులో కలిగేయా ..... ?

శాంతామణి వైపు చూసింది సరళమ్మ.

ఎగ్జిక్యూటివ్ రిలాక్సింగ్ ఛెయిర్‌లో, చిలకపచ్చ పట్టుచీరా, ఎర్రగులాబీరంగు జాకెట్టు ధరించి ..... విగ్రహంలా కూర్చుంది. మెడలోనా,ముక్కూ, చెవులకీ రకరకాల ఆభరణాలు, రెండు చేతులనిండుగా బంగారు గాజులు మోస్తూ - జరుగుతున్న వాగ్వివాదాన్ని - తనకు ప్రమేయం లేనట్లూ , తను యెరిగిన అంశమ్మీద తీసిన సినిమాను - చూస్తున్నట్లుగా చూస్తూ కూర్చుంది శాంతమణి.

ఆమె మండలాధ్యక్షురాలు !

రాజేశ్వర్రావు - ఆమెకు తాళిచ్చేడు. చీరలూ, నగలూ యిచ్చేడు. ఇద్దరు బిడ్డల్ని యిచ్చేడు. ఇపుడు, మండలాధ్యక్షురాలి పదవినిచ్చేడు.

శాంతామణికి - తాళిమీద, నగలమీద, చివరికి బిడ్డలమీద స్వయం నిర్ణయాధికారం లేనట్లే - పదవి మీదగూడాలేదు. ఆమె రాజేశ్వర్రావుకి - పాత కాలంలో అయితే చరణదాసి, నేటి నవీన కాలంలో - మిసెస్ మణీరాజేశ్వర్రావు !

అసలు, మొదటిలో - శాంతామణికి బదులు - రాజేశ్వర్రావే అధ్యక్ష కుర్చీలో కూర్చొనేవాడు. శాంతామణి యింట్లోనే వుండేది. రాజేశ్వర్రావు యిక్కడ పెత్తనం చేస్తూ, అవసరమయిన ఫైళ్లను సంతకాలకు - గుమస్తాలతో యింటికి పంపేవాడు.

సరళమ్మ - ఎమ్డీవోగా వొచ్చేక - ఫైళ్ళు యింటికి వెళ్ళడాన్ని అడ్డుకుంది.

అప్పుడు ఆరంభమయ్యిందా - యీ పవర్ వార్ ? సరళమ్మ ఆలోచనలు అక్కడి దాకా సాగాయి.

శాంతామణి - ఆఫీసుకు రావలసి వచ్చింది. అయినా , అధ్యక్ష స్థానం భర్తకే యిచ్చేది ! కాదేమో, భర్త తీసుకునేవాడేమో ! సరళమ్మ - మండలాధ్యక్షులవారి ఛాంబర్‌కి వెళ్లటం మానుకుంది.

తన ధర్మాన్ని నెరవేర్చటంలో - పోలీసులకూ, రాజకీయ నాయకులకూ, అవినీతి అధికార్లకూ , కంటిలో నలుసులా తగిలేవాడు విలేకరి రవి ! అతని కెమేరా కన్ను - రాజేశ్వర్రావుని ఫ్లాష్‌కొట్టింది. "పదవులు భార్యలవీ - పవర్స్ భర్తలవీ " అంటూ బాక్స్ ఐటమ్ వార్తగా రాసేడాయన. మహిళలకూ, దళితులకూ రిజర్వయిన పదవులు - ఆచరణలో అనుభవించేది వేరొకరని - సాక్ష్యాల్తో సహా వివరించేడు అందులో. ఈ వార్త కొత్తగా బదిలీ అయి వచ్చిన జాయింట్ కలెక్టర్ దృష్టికి వచ్చింది.

ఆ తర్వాత శాంతామణ అధ్యక్ష స్థానంలో కూర్చునేది. ఆ ఛాంబర్లోనే గల సోఫాలో, విలాసంగా కూర్చోసాగేడు రాజేశ్వర్రావు. సబ్సిడీ స్కీముల నుంచి.. యెన్నింటికో కొరకరాని కొర్రుగా సరళమ్మ..! సహించలేక పోతున్నాడు. శరీరంలో నరాలన్నీ రక్తంనిండి, పొంగుతున్నాయి. గొంతునరాలు బిగించి -

".. టీచర్స్ పోస్టింగ్ ఆర్డర్స్‌లో ఎంపీపీదే డెసిషన్, తెలుసా , కావలిస్తే, మిగిలిన మండలాల్లో , ఎమ్డీవోలను కనుక్కో.... " స్వరం హెచ్చించి, ఏకవచన ప్రయోగంతో మాట్లాడేడు రాజేశ్వర్రావు.

సరళమ్మ - ఆయనవైపు తిరస్కారంగా చూసి, లేచి నిల్చుంది. సోఫాలో రాజేశ్వర్రావు -

"...నువ్వు యెన్నిసార్లు, యెన్నింటికో కొర్రీలు వేసినా, ఊరుకున్నాను. ఆడదానవనీ, ఆయన మొహం .. నీభర్త మొహం చూసి వూరుకున్నాను. ఈసారి ఊరుకోను. టీచర్స్ పోస్టింగ్సంటే... యెంత రాజకీయ సంబంధ విషయమో - నీకు తెల్దు. ఇదే చెప్తున్నా - ముందు పోస్టింగ్ ఆర్డర్స్ లిస్టు మాకు యియ్యి. డిస్పాచ్ సెక్షన్‌కి యివ్వొద్దు. డిస్పాచ్ ఆపించు ఆం.. లేదా " ఆగ్రహాన్ని అణుచుకోవటం కోసం, మనిషి ఆయాసపడిపోతూ, విచక్షణను కోల్పోతున్నాడు.

"ప్రజలెన్నుకున్న నాయకులంటే నీకు చులకనైంది. నీకూ.. నిన్నూ.. " ఆయాసంతో మాటాడలేక పోయేడు.

ప్రజలు ఎన్నుకునే - ఎన్నికల ప్రోసెస్ గుర్తుకు తెచ్చుకుని విరక్తిగా నవ్వుకుంది సరళమ్మ.

శాంతామణి భర్త తీరు చూసి వొకవంక ఆశ్చర్యమూ, మరోవంక ఆందోళనా చెందుతోంది. ఎవరినయినా శాసించేట్లు, అందులోకీ ఆడవాళ్లంటే తీసేసినట్లు తేలిగ్గా మాట్లాడే భర్త - వొక స్త్రీ ముందు యింతగా మాటలురాక రొప్పుకుంటుంటే ఆశ్చర్యం వేసిందామెకు. అదే సందర్భంలో ఆగ్రహిస్తే - యెంతటిఅకృత్యానికయినా వొడిగట్టే భర్త స్వభావాన్ని యెరిగున్న ఆమె ఆందోళన పడసాగింది.

అయితే - సరళమ్మ మౌనంగా ఛాంబర్ లోంచి వొచ్చేసింది. అలా రావటమే - ఉద్యోగుల కోడ్ ఆఫ్ కాండక్ట్‌కు చెందిన ఉన్నత శ్రేణి క్రమశిక్షణ ! ఎందరి అధికారుల మౌనాలతోనో ... కోడ్ ఆఫ్ కాండక్ట్ వర్ధిల్లుతోంది.

శాంతామణి ఊరటచెందిందింది.....

అక్కడిదాకా... నిన్నటి ఘర్షణను తల్చుకు నిట్టూర్చింది సరళమ్మ.

".. టీకొట్టుకాడ జనం గుమిగూడేరు. రాజేశ్రావు బాబు దింపిన మనుసులే ఆళ్లు! ఆళేటికి వొచ్చినారో మరీ పొద్దు ? నిన్న.. మీ రెలిపోవొచ్చాక ఆఫీసల్లా అడలగొట్టీసేడమ్మా..." గవరయ్య మళ్లీ నిన్నటి విషయమే చెప్పసాగేడు.

సరళమ్మ ఛాంబర్ నుంచి వెళిపోయేక రాజేశ్వర్రావు అట్నించిటు తిరిగేడు.ఆగ్రహదిశ మార్చేడు.

"..... యింకెందుకా కుర్చీల . గుడిలోన అమ్మోరిలాగ . పదా యింటికి పదా జీపుందా ? బెల్లు గొట్టూ.." శాంతామణి మీద కేకలేసాడు.

శాంతామణి కాలింగ్‌బెల్ నొక్కింది. గవరయ్య వచ్చేడు.

"..జీపు డ్రైవర్ యెక్కడ చచ్చాడ్రా ?" రాజేశ్వర్రావు.

గవరయ్య బుర్రగోక్కున్నాడు.

"పిల్చికిరా. అమ్మగారింటికెల్తారు."

గవరయ్య వెళ్లాడు. రాజేశ్వర్రావు ఫోన్ అందుకొని - జిల్లా పరిషత్ ఆఫీసుకి రింగ్ చేయసాగేడు. శాంతామణి లేచి, చీరకుచ్చిళ్లు సర్దుకు బయల్దేరింది.

"..యిప్పుడే. సిటంకిందట ఎమ్డీవో అమ్మగారు కేంపు యెల్నారట జీపులో ...." వొచ్చి చెప్పాడు గవరయ్య.

"..వెధవఫోన్... యెప్పుడూ అవుట్‌ఆఫ్‌ఆర్డరే, " అని, తిడుతూ దఢాలున ఫోన్ పెట్టేసి యెదురుగా వున్న స్టూలు తన్నేడు.. రాజేశ్వర్రావు. ఆ స్టూలు తిన్నగా వెళ్లి టీపాయికి గుద్దింది. దాంతో, టీపాయి మీదనున్న - ప్లాస్క్, కాఫీ సెట్టూ కిందపడీ, భళ్లున శబ్దం చేసాయి. ఆ శబ్దానికి, ఆఫీసులోని సిబ్బంది ఆందోళనగా చేరారక్కడికి. వాళ్లను చూస్తూ రాజేశ్వర్రావు -

"... మండలాఫీసులో యెవడికి వాడు చక్రవర్తిని అనుకుంటున్నారు. కబడ్దార్. తేల్చేస్తాను. చూపిస్తాను రాజేశ్వర్రావు తడాఖా. మిమ్మల్ని, జిల్లాపరిషత్ ఛైర్మన్ నాయుడుగారిలాగా - నా చేరీ భూముల్లోకి - మిమ్మల్ని ఫైల్లతో రప్పిస్తాను. ఆఁ.. చెప్పండి ఎమ్డీవోకి..." అరవసాగేడు.

ద్వారం ముందు గుంపుగా చేరిన సిబ్బంది, గుండెలు పట్టుకు మెల్లగా జారుకున్నారు. రాజేశ్వర్రావు

అరుస్తూ ఛాంబర్‌లోంచి బయటికి నడిచేడు. వెనకనే శాంతామణీ...! అట్నించి, పడమటిగాలి విసురుగా చాంబర్‌లోకి కొట్టింది. ఎదుటిగోడకు వేలాడ్తోన్న గాంధీ మహాత్ముని కేలండర్ కిర, కిరలాడుతూ క్రిందపడింది. గవరయ్య కిటికీలు మూసేసి, ఛాంబర్ తలుపులు వేసాడు.

అంతదాకా నిన్న జరిగిన భోగట్టా చెప్పాడు గవరయ్య.

"...అయితే భయమేటి ? తాటాకు సప్పుళ్లకి బెదిరిపోయే కుందేళ్లు లేవని చెప్పు. అతగాని కేకలకి అమ్మగారెందుకు అదిరి పోవాల ? ఏవమ్మా ?" గున్నమ్మ మాత్రం ధైర్యాన్నిస్తోంది సరళమ్మకు.

"నీకు బయ్యిమనెవులన్నారు ? అమ్మగారి గురిండంటన్నాను. అంతగా అయితే - తెగిపోయీ దాకా లాగొద్దమ్మా తమకేటి బోయింది... వొదిలీండి... అంతన్ను, అతగాన్తో సెడ్డెందుకు ? ఆ తర్వాత లేని పోనివి ..." గవరయ్య యింకేదో అనబోతే -

"అదిగా పిరికి మాట్లే సెప్పొద్దు. లాగమను, తెగిపోతే.. యెవులికి నష్టమో తెలుస్తాది. అమ్మగారికేటి పోద్దని భయం.." అని గసిరేసింది గున్నమ్మ.

"... ఆదా, ఆ మొండిపట్టుతోటే బతుకు తెంపుకున్నావు గదేటి నువ్వు ..." నిష్ఠుర మాడేడు గవరయ్య.

గున్నమ్మ, యింతెత్తున యెగిరింది.

" ... యెన్ని సుట్లు సెప్పాలినీకు ? నా బతుక్కేటిరా ? దిల్‌కారాజా ..... ! ఒకడికి తలొంచి బతకడం సేతగాదు నాకు !"

గున్నమ్మ కోపాన్ని చూసి, జడుసుకున్న గవరయ్య ఆమెను ప్రసన్నం జేసేందుకు -

" .... తల్లి దండ్రులు పెట్టిన పేరు నిలుపుతావు! నువ్వు చిన్నింటి దానవేటి ? నీకు బయ్యిమా ? మాటవరసకి అలగన్నాను ......" సంజాయిషీగా గవరయ్య .

సరళమ్మ, అర్ధంగాక గవరయ్య వైపు చూడసాగింది.

" సాసుబిల్లి గున్నమ్మమ్మా. మందస మందారం ..." గవరయ్య . అప్పటికర్ధమైంది సరళమ్మకు ! ఆశ్చర్య పోయింది. మందసా రాణీ పేరు యెవరికీ గుర్తులేదు, గానీ ఆ రాజరికాన్ని ధిక్కరించిన సాసుబిల్లి గున్నమ్మ గుర్తుండి పోయింది. ఎందరినో ప్రభావితం చేస్తోంది. రాజు మరణంతో అతని చరిత్ర ముగుస్తుంది. వీరుని మరణంతో చరిత్ర ఆరంభమవుతుందన్న వాక్యం గుర్తొచ్చింది సరళమ్మకు.

" కర్రపుల్లల కోసం కయ్యమేటని వొదిలీలేదు. ప్రేణాలికి తెగించి తిరగబడింంది గున్నమ్మ. కర్రపుల్లకోసమే అయితే ... దివాణమూ అంత గోరకలికి దిగకపోను. వోదా (హోదా) పోద్దని అనుమానం ... ! ! అసలికి రాజేర్రాశావు కయ్యాలన్నీ ... అంది కోసరమే ! అతగాని పవరు మీకాడ సెల్లటం లేదు గదమ్మా ...... " గవరయ్య మాటల్తో సరళమ్మ - మళ్ళీ తన సమస్యలోకి వచ్చింది.

పవర్ పోతుందని - జమిందార్

అధికారం సహించం అని రైతులూ.. ...

వీర గున్నమ్మ చరిత్రలోంచి సారాంశాన్ని గవరయ్య యెంత గొప్పగా - వర్తమానంతోటి విశ్లేషించి చెప్పాడు ! ఆశ్చర్య పోతోంది సరళమ్మ .ఘర్షణకు కారణాలు వెదుక సాగింది. రాజేశ్వర్రావుతో ఘర్షణకు

మూలాలెక్కడున్నాయి ? కాంట్రాక్టుపనులు కేటాయింపుల దగ్గరా ? సబ్సిడీస్కీముల శాంక్షనింగ్ దగ్గరా ? జీపు వాడకం కోసమా ? పండ్స్ కోసమా ? పవరుగల ఛెయిర్‌లోంచి, సోఫాలో కూర్చోవలసి వచ్చినందుకా ? ఇవన్నీ కారణాలు కావచ్చు ! టీచర్స్ పోస్టింగ్ ఆర్డర్స్ ... వొక సాకు ! ఆలోచనలు వొక రూపంలో కొచ్చేయి.

"యానగాలి" వేడిగా, కాలిన జీడిపిక్కల మాడువాసనలను మోసుకొస్తూ బలంగా వీచింది. వీధిలో - నల్లటి పొగమేఘం అలుముకుంది. సరళమ్మ కళ్ళు పులుము కుంటూ ---

" ....... యీ వేసవి మూణ్ణెళ్ళూ సెలవుబెట్టిపోతే బాగుణ్ణు." తనలో తనే అనుకున్నా - బయిటకే విన్పించేయి ఆ మాటలు.

సెలవు పెట్టినా... యెక్కడకు వెళ్లాలి ? రెండేళ్ళుగా రెండు వందల కిలోమీటర్లదూరం - తనకూ భర్తకూ ! పిల్లలు హాస్టల్‌లో ! మరి యెక్కడికి పోను? అసలు తనకూ భర్తకూ - మద్యదూరం వృత్తి రీత్యా యేర్పడిందా...? ఆలోచనలు మళ్ళీ మరో వైపు సాగుతుండగా - వీధిలో సాగుతున్న పెద్ద ఊరేగింపు , వినాదాలు విన్పించేయి.

సరళమ్మ , కుర్చీలోంచి లేచి నిల్చొని ఊరేగింపును గమనించ సాగింది.

" జీడిపిక్కల కొనుగోలు ధర పెంచాలి."

"జీడిపిక్కల వ్యాపార్ల దోపిడీ అరి కట్టాలి"

" జీడితోటల మీద హక్కుపట్టాలు - రైతులకే యివ్వాలి.. " ఊరేగింపువీధి మలుపు సాగింది.

ఇంతలో ఫోన్ మ్రోగింది.

టీచర్స్ పోస్టింగ్ ఆర్డర్స్ లిస్టు యిమ్మని రాజేశ్వర్రావు దబాయిస్తున్నాడట. స్టేకోసం హైకోర్టుకు వెల్తాడట. ఏం చేయమంటారని టైపిస్ట్ ఫోన్ ... !

" లిస్టు యిచ్చేయండి ... " నిస్సత్తువుగా ఫోన్ పెట్టేసింది సరళమ్మ.

" అమ్మా ఆఫీసుకి టైమయినట్టుగుంది ..... " గవరయ్య

" ఈ వేళ - రానయ్యా ... " సరళమ్మ లేచి, బెడ్ రూములోకి వెళిపోయింది.

గవరయ్య, గున్నమ్మ ........ విచారంగా ఒకరి మొహాన్నొకరు చూసుకుంటూ నిల్చున్నారు.

ఒకగంట తర్వాత వొచ్చిన ఫోన్‌కాల్‌కు - సరళమ్మ లేచి ఆఫీసుకి బయల్దేరింది. లేదంటే, జీడిరైతులు మెమొరాండం యిచ్చేందుకు - ఊరేగింపుగా సరళమ్మ యింటికేవచ్చేవారు !

* * *

ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాలులో - సీరియస్‌గా చర్చలు సాగుతున్నాయి. పొడవాటి టేబుల్లకు యిరువైపులా కుర్చీల్లో - పట్నంలోని వ్యాపార్లందరూ కూర్చున్నారు. ఆ టేబిల్ల వొక కొసకు - ఎగ్జిక్యూటివ్ ఛెయిర్‌వుంది. దాంట్లో ఛాంబర్ ప్రెసిడెంట్ పెంట బంగార్రాజు కూర్చున్నాడు. హాలు సీలింగ్‌కి వేలాడిన గాలి పంకాలు - అవిశ్రాంతంగా, అసహనంగా తిరుగుతున్నాయి. బంగార్రాజు - మరింత అసహనంగా వున్నాడు.

" ...... యెవర్ని నమ్మాలో, యెంతదాకా వెళ్లాలో బోధపడ్డం లేదు. ఇటుచూస్తే రైతులు .... మునుపటిలాగ లేరు....... " యెన్ని భయాలనో లోపల దాచుకున్న తంగుడు విష్ణు ... విచారంగా పలికేడు.

మునుపటి రోజుల్లో పెద్దరైతులనో, నాయకులనో, మంచి చేసుకొని - వ్యాపారాన్ని సాగించేవారు. ముందస్తుగా అప్పులు రైతులకిచ్చి, జీడిపంటను హామీ పొందేవారు. గతంలో జీడిపిక్కల వ్యాపారం - తెల్ల బంగారం వ్యాపారంలా వుండేది.

" యెపుడైనా , వ్యాపారస్తుడు యెవుర్నీ నమ్మకోడు. నమ్మినట్టు నటించి, గడులు నప్పుతాడు ...." విష్ణు మాటకు జవాబిచ్చేడు అంధవరపు తవిటయ్య విలాసంగా !

ఈ మధ్య రియలెస్టేట్ బిజినెస్‌లోకి దిగిన తవిటయ్య సెంటు భూమిగాని, చెల్లని రూపాయిగానీ - లేకుండానే - లక్షల రూపాయల హౌసింగ్ స్కీమ్స్, ఇళ్ల ప్లాట్లూ .. టర్నోవర్ చేస్తున్నాడు. ఆసాముల్ని నమ్మించడమే పెట్టుబడి అంటాడాయన !

" అయితిపుడు, నువ్వన్నట్టిగే యెవర్ని నమ్మి, గడి నప్పుతామో చెప్పు." అడిగేడు విష్ణు.

ఆ ప్రశ్నకు , పిల్లారవణయ్య మధ్యలో కల్పించుకొని -

"... రాజేశ్వరావ్రుని పట్టుకుందుమా అంటే - అతగానికీ చీటీ వెళ్లిందట. హిట్ లిస్టుల తొలిపేరతన్దేనట...." గొంతు హెచ్చించి చెప్పాడు. ఆ గొంతులో ఆనందం ధ్వనించింది.

పిల్లా రవణయ్యకు - పెట్రోల్ బంక్ ఏజెన్సీ యిప్పించేటపుడు - రాజేశ్వర్రావు ఎంపీ గారితో సమానవాటా - రమణయ్య వద్ద గుంజేడు. అందుకూ, రవణయ్య గొంతులో ఆ ఆనందం !

".... ఇలాటి చీటీలకి - జడిసేరకం గాదాయన ...." వొకవ్యాపారి

"....జడిస్తే, జీడితోటలెపుడో వొదిలీసును. జడ్డు... జడడు.." వక్కాణించేడు మరొకాయన.

"..అయితే అతగాని చీటీ చింపీడిం కాయిం. అన్నలు పూర్వం నాటి గణపతి లాటోళ్లు కారు..'' బెదిరించేడు సాయిరాజు.

"....రాజేశ్వర్రావూ పూర్వం మనిసికాడు. అతగానికీ పిస్టల్ గిస్టలుంది. అతగాను జడుస్తాడా...?'' జగ్గయ్య శెట్టి.

"పోనీ, అతని సంగతి మనకెందుకు? మనమేటి చెయ్యాల ? అన్నలవర్తమానం ప్రకారం రేట్లు పెంచుతామా ? ఆల్తోటి తగువుకి దిగుతామా ? అది తేల్చండి ...." ఖత్తాయించేడు ఐస్‌ఫ్యాక్టరీ విశ్వనాధం.

ఒకవైపు జీడిరైతులు ఐక్యవేదికగా యేర్పడి, ఊరేగింపులు, మెమొరాండం సమర్పణలు, ధర్నాలూ చేస్తున్నారు. రైతులకు అండగా అన్నలు...! రెండు, మూడేళ్లుగా యేటా సీజన్‌లో యిదే తీరు !

మరోవైపు వ్యాపార్లు, యెవరికి వారుగా వ్యాపారాన్ని విస్తరించుకుంటూ, ప్రక్కవాడితో పోటీ పడుతూ - తమ ఉమ్మడి వ్యాపార భద్రత కోసం అసోసియేషన్ పెట్టారు. నెలనెలా తమ లాభాల్లోంచి - అసోసియేషన్‌కి నిధులు చేర్చారు. గత యేడాది ఛాంబర్ బిల్డింగ్ గట్టేరు. ఎంపీ గారితో ఓపెనింగ్ చేయించారు. ఈ యేడాది కేంద్రమంత్రికి -ఛాంబర్ తరపున ఘనసన్మానం జరిపేరు. బస్ షెల్టర్లు, చలివేంద్రాలూ యేర్పాటు జేసి సాంఘిక సేవ చేసారు. ఇపుడిపుడే వ్యాపారవర్గాలు తమ ఉమ్మడిభద్రతపట్ల నిబ్బరాన్ని పోగుజేసుకుంటున్నారు.... యింతలో అన్నలచీటీ!

"మీరంతా చర్చలాపి ... నేను చెప్పేది వింటారా ? " బంగార్రాజు ఛాంబర్ సభ్యులవైపు చూస్తూ గొంతుపెగిల్చి ప్రశ్నించేడు.

అందరూ నిశ్శబ్దంగా - అతనివైపు మొహాల్ని తిప్పేరు.

"... అమ్మేవాడు, కొనేవాడూ వున్నదగ్గర లాభనష్టాలు అనేవి వుంటాయి. దీన్నెవరూ కాదనలేరు. అయితే అపుడపుడూ - నష్టపోయిన వాళ్లు ఘర్షణకి దిగుతారు. అపుడు బలాబలాల బట్టే లాభనష్టాలు ! ఇది పూర్వంనుండీ సాగుతున్నదే.

మనకాలానికి వచ్చేసరికి - యిందులోకి రాజకీయాలొచ్చేయి.రాజకీయాలనేవి వచ్చేక - 'ప్రజా సంక్షేమం' అన్న అదనపు విషయం చేరింది. వ్యాపార నాణేనికి - ప్రజాసంక్షేమం, లాభం అన్నవి బొమ్మా, బొరుసులు యిపుడు ! దేశ, దేశాల్లో వ్యాపారాలు - యిప్పుడిలాగే సాగుతున్నాయి. అయితే, సంక్షేమం , లాభం రెంటి మధ్యా బేలన్స్ సాగించే ప్రజాస్వామిక రాజకీయాలున్నపుడు ఘర్షణలురావు. ఘర్షణ వచ్చిందంటే - అపుడిక మనం ఆలోచించటానికేమీలేదు. మనం సిద్ధం కావటమే.

ఈ యుద్ధం... యిప్పుడు అన్నల చీటీతో మాత్రమే గాదు యెన్నడో, యెక్కడో ఆరంభమయ్యింది. మార్కెట్‌లో మనం ... రకరకాల యుద్ధాలు చూసేం. ఇకముందూ చూస్తాం. మనం సిద్ధం కావాలి..." ఊపిరి పీల్చి, వదిలి, మళ్లీపీల్చి, వదిలి రిలాక్సవసాగేడు బంగార్రాజు.

" యుద్ధంలో వాళ్లకి పోయేదేం లేదు...దరిద్రం తప్ప! మనకు బోలుడు పోతాయి.." భయాన్ని వ్యక్తంచేసాడు తంగుడు విష్ణు.

"...అయితే అన్నలు దగ్గరకి వెళ్లి, చెవులు పట్టుకొని గుంజీలు దీసి, వాళ్లు చెప్పిన రేటు ప్రకారమే కొనుగోలు చేయు...." విసుగ్గా బంగార్రాజు

"అన్నలరేటు ప్రకారం కొనుగోలు చేసినా , గుంజీలు తియ్యాలా ?" జొజ్జబాగా పెరిగిన వారణాసి హరి అమాయకంగా అడిగేడు.

"రోడ్డువార బడ్డీ నడిపినోడూ ఛాంబర్ మెంబరయిపోతే చర్చలు యిలగే వుంటాయి. పెద్దోడు. పదిరకాల బిజినేస్‌లున్నోడు. చాంబర్ ప్రెసిడెంటు.. అతగాను చెప్పింది వినకండా.. అడ్డుపుల్ల లేంటీ? ఇదిగోర్ర, యిదే చెప్తన్నాను. రోజులు మారిపోనాయి. బంగార్రాజు గ్రయించేడు. మనకందరికీ తెలివితేటలుంటే - అతను చెప్పింది గ్రయిస్తాం. అతనెనకాల నడుస్తాం. లేపోతే సెడిపోతాం అఁ అది తెల్సుకోండి... " హెచ్చరిస్తూ, మాట్లాడేడు బరాటం గుర్నాథం గుర్నాధానికి, బంగార్రాజుకీ ... కంబైన్డ్‌సిన్మాహాలుంది !

గుర్నాదం మాటలతో అందరూ నిశ్శబ్దంగా, బంగార్రాజువైపు చూసేరు అప్పుడు, బంగార్రాజు అందర్నోసారిచూసి, తలపంకిస్తూ కళ్లుమూసుకొని -

"... ఈ రోజుతో, మన అసోసియేషన్ రద్దు..." అన్నాడు,

అందరూ తికమకపడి ఆశ్చర్యంగా చూడసాగేరు.

"...రైతుల మెమొరాండం అందుకున్న ఎమ్మీవో సరళమ్మ మన ఛాంబర్ అసోసియేషన్‌కి కబురు చేసారు. ధరల గూర్చి చర్చల కోసం. అటు అన్నల అల్టిమేటం. అందరూ అసోసియేషన్ నుండి జవాబు కోసం చూస్తున్నారు.ఆ జవాబు చెప్పకుండా ఎస్కేప్ కావడానికి ...ఎసోసియేషన్ రద్దు వొకటే మార్గం..." అన్నాడు కళ్లు మూసి, తలపంకిస్తూ బంగార్రాజు.

అందరూ, ఆశ్చర్యంగా చూడసాగేరాయన్ని, బంగార్రాజు అపుడు, కళ్లు తెరిచి -

" ఇక రెండోది- రాజేశ్వర్రావుకి మనం సపోర్టు యిస్తే అతను యుద్ధభూమిలోకి దిగుతాడు.

మూడోది - అన్నల చీటీ ఆధారం చూపి, మనకు రక్షణ కల్పించమని పోలీసు రక్షణకు దరకాస్తు చేద్దాం.నాలోగోది - మన మిల్లులు కొన్నాళ్ల మూసేద్దాం. నష్టమేంలేదు. ఎప్పుడైనా మనమిల్లులే పిక్కల్ని ఆడుతాయి గదా. గానీ, యీలోగా పనులు పోయిన మిల్లు కూలీలు అన్నల మీద ఆగ్రహిస్తారు.ఇదే ప్రస్తుతం మన యుద్ధతంత్రాలు !" ప్రకటించేడు.

ఛాంబర్ యావత్తూ, తమ నాయకుని యుద్ధతంత్రానికి ఆశ్చర్యపోయింది. విజయం తమదేనన్న నమ్మకం కలిగేసింది అందరిలో. అంతే - ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాలు చప్పట్లతో మార్మోగిపోయింది.

"పదండి, ఈ విషయాలన్నిట్నీ మెమొరాండంలో చేర్చి - ఎమ్మీవో సరళమ్మ గారికందజేద్దాం.." దారితీసేడు బంగార్రాజు !

★ ★ ★

మండలాధ్యక్షురాలి ఛాంబర్‌లో - శాంతామణి ఒంటరిగా వుంది. ప్రక్కనున్న సోఫాలో రాజేశ్వర్రావు లేడు. ఒక అధికార పీఠం మీద - ప్రక్కన నియంత్రించే మనిషెవరూ లేకుండా - స్వేచ్ఛగా కూర్చున్నది శాంతామణి.

తూర్పుగాలి చల్లగా కిటికీలోంచి తగుల్తోంది. వేడి తగ్గి, వాతావరణం చల్లబడే వేళ! సాయంత్రం - నాలుగ్గంటలు దాటుతోంది.

ఇంట్లోయేమీ తోచక ... ? నిజంగా తోచకనా ... వచ్చింది ? కాదు, మనసులోపల యెందుకో అశాంతి, ఆందోళన ...! ఎందుకో, సరళమ్మతో మాట్లాడాలనిపించి - వచ్చింది. వచ్చేక ఆలోచనల్లో పడింది... అర్థగంట దాటింది, తన అవసరం పడి - యెవరేనా వస్తారేమోనని చూసింది కొంతసేపు, ఎవరూ రాలేదు. తనతోపాటు - భర్త వస్తే మాత్రం - తెరలు, తెరలుగా వచ్చేవారు ప్రజలు. అపుడయినా - మాట్లాడేది - ఆయన్తోనే గదా ? అభ్యర్థనలూ, సంప్రదింపులూ ... ఆయన్తోనే !

చిన్నప్పుడు చూసిన దృశ్యం గుర్తొస్తోందామెకు.

వీధిలో - ఒక సాయిబు కోతిని ఆడించేవాడు. కోతి ఒంటిమీద రంగురంగుల జుబ్బావేసేవాడు. మెడలో పూసలు రకరకాల సైజులవి... అలంకరించి, దానిని మచ్చికజేసుకొని - తను చెప్పినట్లల్లా ఆడించేవాడు. ఆ ఆటచూసి, ప్రేక్షకుల నుంచి - డబ్బులు యేరుకొనేవాడు.

ఇప్పటికీ, కోతి ఆటలో మరువరానిది - సాయిబు దానిచేత నీళ్ళు మోయించే ఆట !

కన్నవారింటికి నీళ్లు తీసుకురా - అంటే అదేమో, ముక్కుతూ, మూల్గుతూ నీళ్లకడవ యెక్కడ యెత్తి పడేస్తుందోనన్నట్లు తెస్తుంది.

ఉమ్మడి కాపురంనాడు అత్తవారింట నీళ్లు తెమ్మంటే - యెవరిమీదనో కక్షతో విసురుగా వెళ్లి , నీళ్లు తెస్తూ - ధడాలున కడవదించుతుంది.

అదే వేరుపడి, స్వంతకాపురంనాడు నీళ్లకోసం వెళ్లమంటే - ఖాళీకడవతో నీటికి బయల్దేరిన నుంచీ, తిరిగి నీళ్లకడవ యింట్లో పెట్టేదాక అది అత్యంత జాగ్రత్తగా, బాధ్యతగా, తనదైన కర్తవ్యంగా నీళ్లు తేవటం చూపుతుంది. ప్రేక్షకులు - దాని స్వార్థాన్ని గుర్తించినట్లుగా ' హమ్మ చమత్కారీ' అని నవ్వుకొనే వారు. గానీ శాంతామణికి నవ్వు వచ్చేది కాదు. ఆ దృశ్యం మరోలా, అర్థమయ్యేది.

శాంతామణి, మరి ఆలోచించలేకపోయింది..! మనసు చివుక్కుమంది. అన్యమనస్కంగా, కాలింగ్ బెల్ నొక్కింది.

'అమ్మా' - అంటూ గవరయ్య వచ్చేడు.

గవరయ్యను చూసి, ఆలోచనలాగినయి -

" ఆఫీసులో అందరూ వున్నారా?"

" వున్నారమ్మా.."

".. ఎమ్డీవో గారూ...?"

ఎందుకడుగుతున్నారోనని ఆశ్చర్యపోతూ, గవరయ్య -

"ఉన్నారమ్మా..." చెప్పాడు.

"గవరయ్యా - సరళమ్మ యెలాంటి మనిషి?"

"నిప్పుతల్లి ... "

" అహాఁ అదిగాదు నా ఉద్దేశం. అందర్తో బాగానే వుంటారా?" అని అడిగింది సరళమ్మ.

" అలాటితల్లిని, మరెరగమమ్మా, కష్టం, సుకం కనుక్కుంటారు. చల్లని తల్లి ... " సంబరంగా చెప్పసాగేడు గవరయ్య.

"... మరి, మాతో యెందుకలాగుంటారు... " ప్రశ్నించింది శాంతామణి.

గవరయ్య - జవాబు తెలీక, మౌనం వహించాడు.

"... నాకు మాత్రం ఆవిడంటే - గౌరవమే..." చెప్పింది శాంతామణి.

"... అమ్మగోరికీ తమరంటే అభిమానమేనమ్మా, తమ కట్టూ, బొట్టూ, నడకా... నిండయిన పేరంటాలు లాగుంటారట - తఁవరు..."

ఆశ్చర్యంగా చూసింది శాంతామణి ! ఆ తర్వాత -

"... సరళమ్మని నేను రమ్మన్నానని పిలుస్తావా?" అడిగింది.

గవరయ్య వెళ్లాడు.

శాంతామణికి - ఊరట కల్గించేయి గవరయ్య మాటలు. సరళమ్మకోసం - యేమేనా తెప్పించాలని - కాలింగ్ బెల్ నొక్కింది.

ఈసారి బెల్‌కు - గున్నమ్మ వచ్చింది.

"... ఎమ్డీవో గారు టీ తాగుతారా, కాఫీయా...?" అనడిగింది శాంతామణి .

" యేటీ తాగరు.." జవాబిచ్చింది గున్నమ్మ ముక్తసరిగా.

ఆ జవాబు నచ్చలేదు శాంతామణికి. గున్నమ్మ వైపు అసహనంగా చూస్తూ -

" మరేం తాగుతారు..." అనడిగింది.

" దాహమేస్తే నీళ్లు తాగుతారు.."

మళ్లీ అదే పెడసరం ! శాంతామణి చిరాగ్గా, కుర్చీలోంచి లేచింది. సరిగ్గా అప్పుడే సరళమ్మ వచ్చింది.

ఆమెను చూసి,శాంతామణి ప్రసన్నవదనంలోకి మారింది, కూర్చోమని ఆహ్వానించింది, ఎదురెదురు కుర్చీల్లో కూర్చొని, ఒకరినొకరు కళ్లు కలిపి చూసుకున్నారు కాసేపు. ఆ తర్వాత మరి కాసేపు, టేబిల్ మీది క్లాత్‌ని చూసుకు కూర్చున్నారు.

గున్నమ్మ - తన ఉనికిని తెలియజేసింది.

"... రెండు కొబ్బరి బొండాలు తీసుకురా..." పదిరూపాయలనోటు యిచ్చింది శాంతామణి. గున్నమ్మ వెళ్లింది.

ఆ తర్వాత మళ్లీ నిశ్శబ్దం...

"... యెందుకో పిల్చేరట.." సరళమ్మే అడిగింది.

శాంతామణి, సరళమ్మ మొహం చూస్తూ -

"... గుండ్రని మొహానికితగ్గ ఫ్రేమ్. మీ కళ్లద్దాలు బాగున్నాయి.."అంది. ఇది చెప్పటానికా పిలిచేరన్నట్లుగా చూసింది సరళమ్మ.

" మా ఆయన - మీ ఆర్డర్స్ మీద స్టే కోసం వెళ్లాడు.." అంది శాంతామణి. ఆమెకు, మరేవో విషయాలు మాట్లాడాలని మనసులో ఆరాటం. గానీ - అవి యెలా ఆరంభించాలో తెలీటంలేదామెకు.

"తెలిసింది...." ప్రశాంతంగా చెప్పింది సరళమ్మ.

మళ్లీ కాసేపు నిశ్శబ్దం.

"... కోర్టుకి వెళ్లింది మీ ఆయన కాదు. మీరే...!" నవ్వుతూనే సరళమ్మ.

మొదట అర్థంగాక తెల్లబోయి, తర్వాత అర్థమయ్యేక రానినవ్వు రప్పించుకు శాంతామణి-

" యేమవుతుంది?" అనడిగింది.

" యేమో, కోర్టులు యెపుడు, యే విషయం మీద సునిశితంగా వుంటాయో ఊహించలేం..."

"... స్టే రాకపోతే బాగుణ్ణు.."

ఎందుకలా కోరుకుంటుందో తెలీక, ఆశ్చర్యంగా చూడసాగింది సరళమ్మ.

"అలాంటప్పుడు, స్టే పేపర్స్ మీద సంతకం పెట్టకపోతే బాగుణ్ణుగదా?" ప్రశ్నించింది సరళమ్మ.

"... అసలీయన్ని పెళ్లాడకపోతే బాగుణ్ణు..."

ఆ జవాబుకి విస్తుబోయింది - సరళమ్మ.

" పెద్ద చెరువు కంపు.. పెద్దింటి భోగట్టా .. వేగం బయటపడవు. మా యిళ్లల్లోపల విషయాలెవరికీ తెలీవు. భోగభాగ్యాలూ, అంతస్తులూ... కన్పించినట్లు - మా అంతరంగాలు కన్పించవు.

మీతో మాట్లాడాలన్పించి పిల్చేను. ఏమ్మాట్లాడాలో తెలీటంలేదు. నాకు మాత్రం - మీ మీద కోపం లేదు. మీతో విరోధం లేదు... ఆ! ఈ క్షణానికి గూడా..." అంటూ ఆగింది శాంతామణి.

మాటలయితే ఆగినయిగానీ, ఆమెలో ఉద్వేగం ఆగలేదు.

సరళమ్మ చాలాసేపు - ఆమెను చూస్తూ వుండిపోయింది. శాంతామణి యేమిచెప్పి, యేమి చెప్పలేకపోయిందో ఊహించసాగింది, ఏమి కోరుకొని, దేనితో సమాధాన పడుతోందో - గ్రహించటానికి తంటాలు పడ్తోంది.

శాంతామణి, యింకా ఉద్వేగంగానే వుంది.

శాంతామణి డిగ్రీ పాసయ్యింది. కన్నవారు ... ఆ మండలంలో పేరు ప్రతిష్టలుగల కుటుంబీకులే. - ఒకనాడు కలిమిగలవారే అత్తవారి లాగానే!

ఆదిలో, జమీందారీ రోజుల్లో శాంతామణి కన్నవారు - రైతాంగ పోరాటాలు నడిపేరు. అత్తవారి కుటుంబీకులు మాత్రం దూరంగా వుండి - వ్యవసాయం చూసుకునేవారు.

పోరాటాలు, ఉద్యమాలూ, రాజకీయాల్లో మునిగిన శాంతామణి కన్నవారు - తాతల తరం నుండి - తండ్రులు తరం వచ్చేసరికి పేరు ప్రతిష్టలు పెరిగేయి భూమిపుట్రా తరిగేయి. కేసులూ, ఆందోళనలువల్ల - వ్యవసాయం పన్లు వెనుకబడేవి. అయితే రాజకీయ చైతన్యం కారణంగా - ఆ యింట శాంతామణి తరం వచ్చేసరికి - అందరూ విద్యావంతులైనారు, శాంతామణి, ఆరకంగా డిగ్రీ చదువుల వరకూ వెళ్లగలిగింది.

జమీందారీ రద్దు, స్వాతంత్ర్యం, పంచాయితీరాజ్‌పాలనా - మార్పుల నేపధ్యంలో - చిన్నరైతుగా మిగిలేడు శాంతామణి తండ్రి. నౌకరీలకెగబ్రాకి, ఊరిని విడిచి వెళిపోయేరు శాంతామణి సోదరులు. మిగిలిన కొద్దిపాటి భూమినీ, తాతలనాటి కీర్తినీ వొదులుకోలేక తండ్రి మాత్రం ఊరిలో మిగిలేడు ఊరితో బంధాన్ని - గట్టిపర్చుకునేందుకు - శాంతామణిని రాజేశ్వర్రావుకిచ్చి పెళ్లి చేసాడు.

రాజేశ్వర్రావు - 'లా' కోర్సు పూర్తి చేసి, రాజకీయ వేదిక కోసం వెదకగా, శాంతామణి కన్నవారి కుటుంబ సంబంధం.. కలిసివచ్చింది. ఈలోగా తెలుగుదేశం ఆవిర్భావం, రాజేశ్వర్రావు పసుపుచొక్కా ధరించటం.. ఎమ్మెల్యేగా గెలవటం - తర్వాతి ఎన్నికల్లో ఓటమి - మరోసారి పోటీ పడటం - ఈ లోగా మండలంలో పట్టుకోల్పోకుండా పావులు నడపటం - భాగంగా , స్త్రీలకు రిజర్వు స్థానంలో శాంతామణికి మండలాధ్యక్షురాల్ని చేయటం.. జరిగింది.

తండ్రికోసమని, పెళ్లి విషయంలో తొలిసారిగా రాజీపడిన శాంతామణికి యిపుడు - అన్ని విషయాల్లోనూ... రాజీయే మార్గంగా మిగిలింది.

ఎప్పుడో,ఎందుకో. వొకోసారి.. బ్రద్దలవుతుంది లోలోపల గడ్డకట్టుకున్న అసంతృప్తి....

ఫోన్ మ్రోగింది. రిసీవర్ యెత్తి 'హలో..'' అంది శాంతామణి.ఆ తర్వాత, ఫోన్ సరళమ్మకి అందించి-

" మీ కోసమే. కలక్టరేట్‌నుంచట..'' అంది.

సరళమ్మ ఫోన్ అందుకొని, మాట్లాడింది.

"... జన్మభూమి రెండో విడతప్రోగ్రాం. రేపు కలక్టరుగారు ధనుపురం విలేజ్ వస్తారట. ఏర్పాట్లు చూడాలట..." ఫోన్ పెట్టేస్తూ, చెప్పింది సరళమ్మ.

గున్నమ్మ కొబ్బరి బొండాలను తెచ్చి, ఇద్దరికీ అందిస్తూ -

"...మొకమ్మీద తన్నీగల్నసీసరికి తగ్గేడు. గాడిదలు కాసినోడిలాగ ఆడి మొహమూ.. ఆడూ..." యెవర్నో దులిపేసిన బోగట్టా చెప్పింది.

"... ఎవర్ని దులిపేవంటా?'' నవ్వుతూ అడిగింది సరళమ్మ.

".. అండమాన్నిండొచ్చీసేడట. నా కాళ్లకాడిక వుండిపోతాడట..''అంతేచెప్పింది. సరళమ్మకు అర్ధంగాలేదు. గానీ శాంతామణికి అర్థమైంది.

"... నీ భర్తా..?'' అనడిగింది శాంతామణి.

"...భర్తా? బల్లిగుడ్డా? ఆడికీ, నాకేటి సంబంధం?''

"... విడాకులివ్వలేదు గదా..?''

" గుడ్డికన్ను యిప్పితే ఎంత, మూస్తే యెంత? యిడాకులే కావాలంతే - యీ సెనాన యిచ్చీగల్ను...'' విసురుగా బదులిచ్చి ఖాళీ బొండాలు తీసుకొని, వెళిపోయింది గున్నమ్మ.

శాంతామణి - వెళ్తోన్న గున్నమ్మ వేపే చూడసాగింది.

సరళమ్మ - వస్తానండీ - అంటూ లేచింది.

★ ★ ★

సరళమ్మ తిరిగి తన సీట్లోకి వచ్చి కూర్చున్నాక, హెడ్‌క్లార్క్ వచ్చి, కలెక్టర్ ప్రోగ్రాం మళ్లీ చెప్పాడు.

"... ధనుపురం ఊరిలో పరిస్థితి బాగోలేదు మేడం. ఆ ఊరిరైతుల్ని ... జీడితోటల నుంచి,

తరిమి కొట్టేరట. నిన్నరాత్రివేళ జరిగిందట. రాజేశ్వర్రావుగారి హస్తం... వుందంటారు. రైతులకి బలమైన గాయాలయినాయట. దాడిచేసిన వారికీ.. కొందరికి దెబ్బలు తగిల్నాయట..." హెచ్సీ, చెప్తున్నాడు.

సరళమ్మ ఆలోచించసాగింది, ఏం చేయాలో పాలుబోవటంలేదు. ధనుపురం రైతులు ఊరేగింపుగా వచ్చి మెమొరాండమిచ్చేరు. రేపటి జన్మభూమి కార్యక్రమాన్ని బహిష్కరిస్తామన్నారు.

ఆలోచిస్తూ - టేబుల్ మీది - రైతుల మెమొరాండాన్ని మళ్లీ చదువసాగింది.

జీడిపిక్కల కొనుగోలు ధర పెంచాలనీ, తోటలపై బినామీ లీజుపొందిన రాజేశ్వర్రావు వర్గం వైదొలగాలనీ, రైతుల వ్రేలిముద్రల సాక్షిగా సమర్పించిన వినతి పత్రం!

" ఇటు రైతులూ - అటు రాజేశ్వర్రావు వర్గమూ, వ్యాపారవర్గమూ మూడు వర్గాల మధ్యా ... యీ మూడేళ్లనించే కాదు మేడం - యెప్పటి నుంచో యీ ఘర్షణ సాగుతోంది..." హెచ్సీ, సమస్య గురించి చెప్పాడు. ఎవరెవరి మధ్య... యెందుకోసం సాగుతోన్న ఘర్షణో అర్థమయ్యేట్లు చెప్తున్నాడు.

సరళమ్మకాక్షణాన... యిరువైపులా యుద్ధానికి మోహరించి యెదురెదురుగా నిల్చున్న రెండు సైన్యాలు గుర్తొచ్చేయి. ప్రజలూ, తనూ, తనతోపాటూ శాంతామణీ.... ఒకవైపు నిల్చున్న సేనలో వున్నట్లనిపించింది. సరళమ్మ దీర్ఘంగా ఆలోచించి -

" ఇపుడు ధనుపురం వెళ్లాలి, జీపు డ్రైవర్ని పిలవండి..." అంది. హెడ్‌క్లార్క్ ఆందోళనగా -

" .... యిపుడా ఊరువెళ్లటం మంచిదికాదు మేడం. ఆ ఊరు అన్నలకు బలమైన స్థావరం..." మరింకేమీ చెప్పడానికి సాహసం లేక ఆగాడు.

"... ఈ రోజే, ఆ రైతుల్తో మాట్లాడితే... ఫలితముంటుంది. రేపు కలెక్టర్ గారి ప్రోగ్రాం..."

సరళమ్మ మాటలకు మధ్యలోనే అడ్డుతగిలి -

" నిజమే మేడం. కానీ సిట్యుయేషన్ గమనించండి. రైతులు దెబ్బతిని వున్నారు. అంతేగాక, ఆ కొట్లాటకేసు మీద - రైతునాయకులను కొందర్ని పోలీసులు అరెస్టు చేసారు. ఈ పరిస్థితిలో అన్నలేం చేస్తారో అని అందరూ ఆందోళనలో వున్నారు. నాలుగైదేళ్ల కిందటనుకుంటాను, స్మారకసభ సందర్భంగా అరెస్టయిన తమ నాయకుల విడుదలకోసం - ఎమ్మెల్యే గారిని కిడ్నాప్ చేసారు...!" చెప్పుకు పోతున్నాడు హెచ్.సీ.

సరళమ్మలో వ్యక్తపరచలేని అశాంతి అలుముకుంది. కుర్చీలో వాలిపోయి.. కళ్లు మూసుకుంది. సముద్రగాలి.. చల్లగా తగుల్తోంది.

కళింగతీరం వచ్చేక - అశోకుడు యుద్ధవిరమణ చేసాడట! బుద్ధంశరణం గచ్ఛామీ అన్నాడట! శాంతిని ఆశించేడట! గానీ, యేదీ శాంతి...!

" మేడం, మీరు యింటికి వెళ్లి రెస్ట్ తీసుకొండి. నేను, మరోసారి కలెక్టరేట్‌కి ఫోన్ చేసి, ప్రోగ్రాం వాయిదా అడుగుతాను. కాదూ, కూడదంటే - పోలీస్ ప్రొటక్షన్ యేర్పాటుకి ట్రై చేస్తాను...." చెప్పాడు హెచ్సీ.

"... వొద్దొద్దు. మీరేం చెయ్యొద్దు. రేపు ఉదయానే... నేను ధనుపురం వెళ్తాను. నేను రైతుల్ని వొప్పిస్తాను - జన్మభూమి కార్యక్రమం జరిపిస్తాను..." విశ్వాసంతో ధృఢంగా పలికింది సరళమ్మ.

హెడ్ క్లార్క్ , ఆశ్చర్యంగా, నోరు వెళ్లబెట్టి చూస్తూ నిల్చుండి పోయేడు. సరళమ్మ లేచి, యింటికి బయల్దేరింది.

★ ★ ★

ప్రొద్దున్నే నిద్రలేచి, సరళమ్మ పోలీస్ స్టేషన్‌కి ఫోన్ చేసి అరెస్టు జేసిన రైతుల్ని విడిచిపెట్టమని కోరింది. ఇన్స్పెక్టర్, అభ్యంతరం చెప్పబోతే - జామీనుగా తాను వుంటాననీ ఇల్లూ, పొల్లూ భూమి పట్టా కలిగిన రైతులు - పరారయిపోరనీ కోర్టుకి హాజరవుతారనీ నచ్చజెప్పింది. ఇన్స్పెక్టర్... వొప్పుకున్నాడు.

శుభోదయమే..! రైతుల్ని శాంతపర్చవచ్చు. ఇక వ్యాపారుల్తో మాట్లాడ్తేనో..! పెంట బంగార్రాజుని కన్విన్స్ చెయ్యాలి యెలాగైనా- అనుకుంటూ ఫోన్ చేసింది. బంగార్రాజు - వ్యాపారవేదాంతం మాట్లాడేడు. తమకు అసోసియేషన్ లేదనీ, తలోదారి అనీ, ఎవరికి యెవరీ పోటీ ప్రపంచాన... అన్నాడు.

మళ్లీ నిస్పృహ చోటుచేసుకోసాగింది. ఫోన్ పట్టుకు, ఆలోచనల్లో మునిగిపోయింది.మిల్లర్స్ అసోసియేషన్ రద్దూ, రైతులపై దాడీ, పోలీసుకేసూ... యివన్నీ ఒక పథకం ప్రకారం జరిగిన ఘటనలుగా... అనుమానం కలిగింది సరళమ్మకు! అయితే, యీ పథకానికి సూత్రధారి యెవరు..? రాజేశ్వర్రావా? ఆలోచనలు రాజేశ్వర్రావువైపు మళ్లినాయి...!

రాజేశ్వర్రావు.... విరోధిచుట్టూ వల విసురుకుంటూ వస్తాడు. రెండేళ్లుగా - మండలాభ్యుదయ అధికారిణిగా.. యెన్ని వలలను ఛేధించుకు వచ్చిందో సరళమ్మ...!

మండలంలో, కన్‌స్ట్రక్షన్ వర్క్స్ కాంట్రాక్టులు - తనవర్గంవారికే యిమ్మంటాడు. తీరా, యిచ్చేక, ప్లానూ, ఎస్టిమేషన్ ప్రకారమూ - కన్‌స్ట్రక్షన్ జరగదు. అయినా, బిల్స్ పాస్ చేయమని వొత్తిడి! సంబంధిత ఇంజనీర్ని లొంగదీసి, ఎమ్ బుక్ రాయింపించి - కాంట్రాక్టర్ని సరళమ్మ మీదకి యుద్ధానికి వొదుల్తాడు.

సరళమ్మ చాలావాటిదగ్గర - సరేలే అని రాజీపడేదిగూడా! ఒక్కోసారి, ఎంపీపీ శాంతామణి మధ్యవర్తిత్వం.

బలహీనవర్గాల కోలనీల కోసం, సబ్సిడీ స్కీములకోసం, వృద్ధాప్య పెన్షన్ కోసం... శాంతామణి యేమేమో చెప్పేది -

"రాజకీయాల్లో వున్నవాళ్లం, కొన్ని స్కీములు మేము ప్రసాదించినట్లుగా ప్రజలకు కనబడాలి. మా ఓటర్లకు, కొన్ని పథకాలు అందాలి. ఇదంతా యిప్పటి రాజకీయం, మేమే కాదు, యెవరైనా అంతే ! అన్నిటికి మీరు అడ్డు పడితే యెలా...?"

ప్రజలను ఓటర్లుగా చూసే రాజకీయాల్ని .. ఖండించలేక, అంగీకరించలేక.. అవస్థలు పడ్తోంది సరళమ్మ. రెండేళ్లుగా.. అన్నిచోట్లా... రాజేశ్వర్రావు.. వలలు విసుర్తూనే వున్నాడు. ఈవేళ, నేరుగా తలపడి, టీచర్ పోస్టింగ్ ఆర్డర్స్ మీద.. స్టే వరకూ వెళ్లాడంటే - వెనుక, యెన్నో కారణాలు !

అన్నింటిలో ముఖ్యమైనది - ఛీఫ్ మినిస్టర్ ఎంప్లాయిమెంట్ యోజన (సి.ఎం.ఇ.వై.) పథకం ! ఒక్కో గ్రూపుకీ డబ్బయి అయిదువేల రూపాయల ఆర్థిక సహకారం ! తన గ్రామంలో, తన చెప్పుచేతల్లో నున్న మనుషుల్తో రెండు సంఘాలు పెట్టించి, సి.ఎం.ఇ.వై. పథకం కోసం దరకాస్తు చేసాడు. నిజంగా అర్హులూ, లబ్ది పొందాల్సిన వారూ - అదే గ్రామ పంచాయితీ హేమ్‌లెట్ విలేజిలోని - "అంబేద్కర్ యువశక్తి" వారూ, "శారదా మహిళా మండలి" వారూ! సరళమ్మ... రాజేశ్వర్రావ్ వలలను ఛేధించింది. తన మనుషులచేత రాజేశ్వర్రావు - ధర్నా చేయించేడు. పై అధికార్లకు కంప్లయింట్ పెట్టించేడు. భయపెట్టించేడు. అయినా సరళమ్మ - సి.ఎం.యి.వై. పథకం - రాజేశ్వర్రావుకి దక్కనీయలేదు.

సరళమ్మ ... ఆలోచనల్లోనే వుంది.

గున్నమ్మా, గవరయ్యా పోట్లాడుకుంటూ వచ్చేరు.

" ఏంటబ్రా - యిద్దరూ పోరు జేసుకుంటున్నారు..." అడిగింది సరళమ్మ.

" మాలో మాకు పోరేటమ్మా. ఆస్తి కోసమా, అధికారం కోసమా పోరు జేసుకుంటాం..? మీ గురిండే తగువులాడ్తన్నాం. ధనుపురం యెళ్లొద్దని నీనూ, యెల్లాలనీ తనూ..." చెప్పాడు గవరయ్య.

గవరయ్య మాటల్తో యేదో యెరుక గలిగింది సరళమ్మకు! ఎవరయినా - పోరుజేసేది అధికారం కోసమో.. ఆస్తి కోసమో...! నిజమేగదా.! ఎంత సింపుల్‌గా చెప్పాడు గవరయ్య! ఆశ్చర్యంగా చూడసాగింది.

ఇంతలో జీపు హారన్ విన్పించింది.

సరళమ్మ, గబగబా బయల్దేరింది. ఆమెతో పాటు, గున్నమ్మా గవరయ్యా బయల్దేరారు. జీపు ధనుపురం వైపు సాగింది.

మండలకేంద్రం దాటి పదిహేను కిలోమీటర్ల కాకిమార్గంలోవుంది ధనుపురం . సముద్రతీరం. పచ్చని కొబ్బరి చెట్లూ, జీడితోటలూ కళ్లనుండి.. వెనక్కు కదుల్తుంటే - సీటు వెనక్కివాలి, సరళమ్మ -

" కవిటి ఉద్దానం - మీ మెట్ట ఉద్దానం మీద సంపద ప్రాంతం గదా?" అనడిగింది గవరయ్యను.

" ఔనమ్మా.."

సరళమ్మ - మరింకేమీ ప్రశ్నించలేదు. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ... ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ కూర్చుంది. అర్ధగంటలో - జీపు ధనుపురం ఊరు సమీపించింది.

ఊరి ముందరి పాఠశాల ఆవరణలో - ఎర్రజెండాల్తో రైతులు బైఠాయించేరు. ఊరిలోకి వాహనాలు రాకుండా - నాటు బండ్లను బారికేడ్లుగా పెట్టేరు. జీపు అక్కడ ఆగింది.

"అదిగదిగో తీరప్రాంత మదేనంట ఉద్దానం..

ఉద్దానం కాదుర - ఉద్యానవనం రా...." యెవరో గొంతునిండుగా, ఉద్దానం సౌందర్యాన్ని పలికిస్తున్నాడు.

జీపు దిగింది. పాట ఆగింది, రైతులు నినాదాలారంభించేరు. గవరయ్యా, గున్నమ్మా - అమ్మగారి కిరువైపులా చేరారు. సరళమ్మ నేరుగా, పాఠశాల ఆవరణలోకి నడిచేరు. రైతులు లేచి, దారికడ్డంగా నిలిచేరు. దాదాపు పదిహేను నిమిషాలు నినదించేరు....!

సరళమ్మ - వారి సామూహికకంఠానికి ఆశ్చర్యపోయింది. ఇంతమంది మధ్య యేవైరుధ్యమూ లేదా ? వైరుధ్య రహితంగా, యిందర్ని ఐక్యంజేసిన శక్తియేది? ఆలోచనల్తోనే, అసంకల్పితంగా చేతులెత్తి నమస్కరించింది వారికి!

నినాదాలాగినయి.

"నేనిపుడు, మీ అవసరంపడి వొచ్చేను, మీతో మాట్లాడాలి..." అన్నదామె.

"ప్రజలవద్దకు పాలనగదా ! డ్రామాకంపెనీ అంతా దిగలేదేం?"జనంలోంచి, యెవరో ప్రశ్నించేరు.

సరళమ్మ -

".. మీలో, యెవరితో మాట్లాడాలి?" అనడిగింది.

"యేం? అందర్తో మాట్లాడలేవా? మళ్లీ జనంలోంచి ప్రశ్న.

"మాట్లాడ్డానికేవుంది. మెమొరాండం చూడ్లేదా?" జనంలోంచే.

" దయచేసి, శాంతపడండి, మీ మెమొరాండం చూసేను. మీరు కోరేవి న్యాయమైనవే..." వివరించబోయింది సరళమ్మ.

" అయితే, మరి తీర్చడానికి అడ్డమేటో?"

సరళమ్మ క్షణకాలం మౌనంగా అందర్నీ చూసి -

"..... ప్రయత్నిస్తున్నాం. ప్రభుత్వంలో యేపనయినా, ప్రొసీజర్స్ ప్రకారం జరగాలి..." అంటూ విధానాలు గురించి చెప్పబోయింది.

"..... ఏ ప్రొసీజర్స్ ప్రకారమూ - మా రైతుబతుకుల్లో యింత బుగ్గి పోస్తున్నారంతా..?" జనంలోంచి ముందుకొచ్చి, ప్రశ్నించేడు రఘురామయ్య.

రఘురామయ్యకు అరవయ్యేళ్లుంటాయి. సన్నగా, తెల్లగా,, కోటేరేసిన నాగలిలా తలపాగాతో నిల్చిన రఘురామయ్యను సరళమ్మ గౌరవభావంతో చూసింది. సాత్వికమైన కళింగరైతు ... కళ్లకు గట్టేడామెకు.

"..... యే ప్రొసీజర్స్ ప్రకారమూ - కాలుష్యాన్ని పట్టణానికీ, పల్లెలకీ సరఫరా జేసే మిల్లులకి లైసెన్స్‌లిచ్చేరు? జీడిపిక్కల ధర పెరగకుండా, తెల్ల బంగారాన్ని కుట్ర పద్ధతుల్తో యేటేటా నొల్లుకుపోతున్న వ్యాపారులకి - యే ప్రొసీజర్స్ ప్రకారం రక్షణ యిచ్చేరు? ఏళ్లతరబడీ - చారెడు భూమికీ, జానెడు గుడిసెకీ, గుక్కెడు నీటికీ... యిక్కడి జనం హరిగోసబెట్టినా - పట్టించు కోవటానికి మీ ప్రభుత్వానికి యే ప్రొసీజర్స్ అడ్డొస్తున్నాయి? ఇక్కడి మొక్కల్ని పెంచి, తోటల్ని సాకినోల్లం మేము. మా తోటలపైకి, మా మీదకీ గూండాల్ని యెగదోలి కొట్టించేరు. గూండాలను అరెస్టు చెయ్యమని పోలీసుల్ని అడిగితే - మా మీదే కేసుపెట్టారు. మా జనాలను అరెస్టు చేసారు.

ఇక్కడి, నా తరం రైతులు - జమీందార్ల జులుం, తెల్లోల్ల మాయ, నల్లదొరల దోపిడీ, హింస అనుభవించి పండిపోయేరు. ఇంకెన్నాళ్లీ హింస..? కళ్లు తెరిచి చూడండి..." రఘురామయ్య ఒంటిమీది లాల్చీ తీసి, వీపు చూపించేడు.

అతని వీపు - చాలుబోసిన భూమిలా విచ్చుకొని వుంది ఎర్రగా ! వీపు మీద రక్షక భటులో, కిరాయి గూండాలో - తమ రాక్షసత్వాన్ని రాసేరు.

సరళమ్మ కళ్లల్లో నీళ్లు తిరిగేయి, రైతుల దేహాలు చూడటానికి భయంవేసిందామెకు. కొంతసేపు గొంతుకడ్డంగా దుఃఖపుతెర ! ప్రయత్నంమీద గొంతు సవరించుకొని -

"... ఇప్పటివరకూ, యేది, యెందుకు యెవరు చేయించారోగానీ- అంతా అసంగతమే జరిగింది. దీన్ని నేను సరిదిద్దే ప్రయత్నం చేస్తాను. నేను వచ్చేముందు, పోలీసుల్తో చర్చించి, మీ రైతులను విడిపించే ప్రయత్నం చేసాను. గంటకో,ఘడియకో అరెస్టయిన మీ వాళ్లంతా విడుదలయివస్తారు. మిగిలిన విషయాల్ని - కలెక్టర్ గారితో సంప్రదిస్తాను..." నమ్మకంగా చెప్పసాగింది సరళమ్మ.

" అందుకే, కలెక్టర్‌ని రానీండి. జనం లేని జన్మభూమిని అతనికి చూపిస్తాం ..." యెవరో జనంలోంచి పలికేరు.

"కలెక్టర్ ప్రోగ్రాం బహిష్కరిస్తే - మీకే నష్టం. ఈ ఊరి పాఠశాల రిపేరుకీ, గ్రామంలో రోడ్లకీ నిధులు శాంక్షనైనాయి. మీరు శ్రమదానం చేస్తే - యీ రెండూ జరుగుతాయి. ఆందోళనలుజేసి - అభివృద్ధి కార్యక్రమాల్ని అడ్డుకోవద్దు..." నచ్చజెప్పే ధోరణిలో సరళమ్మ.

"... అభివృద్ధికి మోకాలడ్డేవారము మేమన్నట్లుగా మాట్లాడ్తారందరూ...! అసలేది అభివృద్ధి ? ఎవురు అభివృద్ధి అవుతున్నారు?తెల్లోడుపోయి -యాభయ్యేళ్లయినా జరగని అభివృద్ధికి -యెవరు మోకాలడ్డారు?' ప్రశ్నించేడు రఘురామయ్య.

సరళమ్మ జవాబుచెప్పలేక పోయింది.

అయినా, అటూ యిటూ వాదోపవాదాలయినాక - సరళమ్మ సాధించింది. రైతుల్ని ఒప్పించింది. కలెక్టర్‌గారి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రైతుల్ని అంగీకరింపచేసింది. రెండ్రోజుల్లో- కలెక్టరేట్‌కి రాయబారం వెల్దామనీ, తనూ వొస్తాననీ మాటయిచ్చింది.

పదకొండుగంటలవేళకు, కలెక్టర్‌గారి రాకతో - అక్కడ జన్మభూమి కార్యక్రమ తంతు ఆరంభమైంది.

* * *

సాయంత్రం అయిదుకల్లా - సరళమ్మ సంతృప్తిగా ఆఫీస్ చేరింది. గవరయ్య కూడా సంబరపడిపోయేడు.

"నేను సెప్పాను గదమ్మా - భయమేట్లేదు, జెనం మంచోళ్లని..." అమ్మగారికి మంచినీళ్లిస్తూ, గున్నమ్మ.

మంచినీళ్లు తాగేసి -

"గున్నమ్మా, నువ్వు యింటికి పదా.వంటపని చూస్తుండు.అర్జెంటు ఫైల్సవీ చూసి వొచ్చేసాను" చెప్పింది సరళమ్మ.

గున్నమ్మ వెళ్లింది. గవరయ్య... గదిబయట స్టూలుపై కూర్చున్నాడు.

టైపిస్ట్ వచ్చి, నిల్చున్నాడు.

" చెప్పండి.." అంది సరళమ్మ.

".. టీచర్స్ ట్రాన్స్ఫర్స్ మీద స్టే వచ్చిందట మేడం. ఏదోపనిమీద వచ్చిన కేష్యూబిజినెస్ మేన్ కనకరాజు చెప్పాడు. రాజేశ్వర్రావు గారు - వీళ్ల చాంబర్‌కి ఫోన్ చేసారట." యింకా, మరికొన్ని తెలిసిన విషయాల్ని చెప్పటానికి సంశయిస్తూ ఆగేడు టైపిస్ట్.

" సరే, రానీయండి. ఏవయినా ఫైల్స్ వుంటే పంపించమనండి హెచ్‌సి గార్ని..." తెంపేసింది విషయాన్ని సరళమ్మ.

టైపిస్టు ఉత్సాహం నీరుగారి పోయింది. మౌనంగా కదిలేడు.

సరళమ్మకు - ఆఫీస్ స్టేవ్‌తో యీ ఘర్షణ పంచుకోవాలనిలేదు. ఆఫీసు స్టేఫ్‌లో యిప్పటికే అనేక గ్రూపులు. కులం. ప్రాంతం, రాజకీయం...! ఎంపీపీ గ్రూప్, ఎమ్మెల్యే గ్రూప్‌గా సిబ్బంది తయారవటం యిష్టం లేదామెకు.

హెచ్‌సీ ఫైల్స్‌తో వచ్చేరు.

సరళమ్మ అందుకొని, ఒక్కోటీ చూస్తుంటే -

" మేడం. మీరు ట్రాన్స్ఫర్ కోసం రిక్వెస్ట్‌లెటర్ పెట్టారా?" ప్రశ్నించేరు హెచ్‌సీ.

ఆ ప్రశ్న, రెండేళ్లకిందట, యేసందర్భానో భర్త వేసిన ప్రశ్నను గుర్తు చేసింది....

" ఎన్నిసార్లు చెప్పాలి? రిక్వెస్ట్ లెటరెందుకు పెట్టవు?" భర్త, విసుగునీ కోపాన్నీ మిళితం జేసిన స్వరంతో ప్రశ్నించేడు.

ఆయన బ్యాంకు ఆఫీసర్, ఆయనకు పంచాయితీరాజ్‌లో అధికార్లతో మంచి స్నేహం వుంది. స్నేహానికి బదిలీలు జరగవు, ఆఫీస్ సాంప్రదాయాల్ని పాటించాలంటుంది సరళమ్మ. అవి పాటించేందుకు యిష్టపడని సరళమ్మ - బదిలీ కోసం లెటర్ పెట్టడంలేదు.

" నీ కెందుకవన్నీ? నువ్వు లెటర్ పెట్టు. మిగతావి నేను చూసుకుంటాను..." భర్త ఆదేశం! ఆయనకన్నీ ప్రోఫిట్ ఆర్ లాస్... అనాలసిస్‌లే. సరళకు - మంచీ, చెడూ, రూల్సూ ప్రొసీజర్సూ...

" ఆ చూసుకోవటమే యిష్టంలేదు... మీరయినా, నేనయినా! ప్రొసీజర్స్ ప్రకారం జరిగితే జరగనీ, లేదంటే లేదు..."

సరళమ్మ నిర్ణయానికి కోపగించిన భర్త, ఆమెతో మాటలు మానేసాడు. గతంలో - ఒక ఆదివారం సరళమ్మ ఆయన దగ్గరకు వెళ్తే, మరో ఆదివారం ఆయన సరళమ్మ దగ్గరకు వచ్చేవారు. నెలలో మిగిలిన రెండు ఆదివారాలు - విజయవాడ, గుంటూరు రెసిడెన్షియల్ కాలేజీల్లో వున్న కొడుకూ, కూతుర్నీ చూడటం కోసం వెళ్లేవారిద్దరూ. రెండేళ్లుగా - మారిపోయిందా క్రమం. భర్త రావటం మానేసాడు. గుంటూరులోనో, విజయవాడలోనో యెదురయ్యే వాడు. పిల్లలు గ్రహించకుండా తంటాలుపడేది సరళమ్మ.....

".... అంటున్నారు. డీపీవో ఆఫీస్‌లో భోగట్టా. మీకు బదిలీ అవచ్చని..." హెచ్చీ, మాటలు నమిలేరు.

"మంచిదే. " నవ్వుతూ, సీట్లోంచి లేచింది సరళమ్మ.

గవరయ్య వచ్చి -

" రిక్షా పిలిసేనమ్మా..." అన్నాడు.

★ ★ ★

ఆశ్చర్యకరంగా - రెండోరోజు సరళమ్మ భర్త వచ్చేడు. రాజేశ్వర్రావు సహకారంతో - తనుండే మండలానికి సరళమ్మ బదిలీ ఆర్డర్‌ని పట్టుకు వచ్చేనని చెప్పాడు. మర్నాడు, ఆఫీసుకి వెళ్తే... రిలీవర్ గూడా వచ్చాడు. సరళమ్మకు ఆలోచించేందుకు గడువూ లేదు.

గున్నమ్మా, గవరయ్యా - అమ్మగారి సామాన్లన్నీ సర్దేసారు. ఇంట్లో సామాగ్రి పార్శిల్ జేస్సారు. ఆ రాత్రి భోజనాలు పూర్తిజేసి, వరండాలో కూర్చుంది సరళమ్మ. ఎదురుగా భర్త.

"... యిదే ఆఖరు రాత్రి యీ ఊర్లో నాకు. దాదాపుగా తొమ్మిది వందల రాత్రుల్లు గడిపేను" యేదో గుండెలోపలి... అనుభూతి, మాటల్లోకి మార్చలేక మధనపడ్తూ పలికింది సరళమ్మ.

" రోజులు లెక్కబెడ్తారు ఎవరయినా. నువ్వేంటీ రాత్రుల్లని..."

అనేసాడేగానీ, పూర్తి జేయలేకపోయేడు భర్త.

"గున్నమ్మా - సిన్మాకెల్దామా?" అకస్మాత్తుగా అడిగింది సరళమ్మ.

" సిన్మా అంటే ఆగుతాదా? ఊష్టమొచ్చినా వొదిలేస్తది సిన్మాకెల్తే గున్నమ్మకి" గవరయ్య హాస్యమాడేడు.

సరళమ్మ భర్త గూడా అంగీకరించేడు. ఆయన తెచ్చిన కారులో అందరూ సినిమాకు వెళ్లారు.

గున్నమ్మ టిక్కెట్లు తెచ్చింది. అందరూ హాలులోకి నడిచేరు. సినిమా అడ్వర్టయింజ్‌మెంట్స్ వస్తున్నాయి. ఇంతలో హాలులో కలకలం !

అందరూ పెనువిపత్తు యెదురయితే - తోసుకుంటూ పారిపోయేట్లు పరుగులు తీస్తున్నారు. ఎవరూ, యెవరికీ పలుకుట లేదు. గున్నమ్మ, గవరయ్య అమ్మగారి కిరువైపులా చేరి - అయ్యగారితో పాటూ మూకలోంచి బయటికి నడిచేరు.

బాల్కనీ మీంచి, ఎవరో మెగాఫోన్‌లో అరుస్తున్నాడు -

".... అందరూ వెంటనే వెళ్లిపోండి. హాలు ఖాళీ చేసేయండి. జీడిపిక్కల వ్యాపార్ల దగాకోరు విధానానికి శిక్షగా - సిన్మాహాలు పేల్చేస్తున్నాం. అందరి వ్యాపార్లకిదే ఆఖరి వార్నింగ్. రైతులకు న్యాయం జరగాలి..."

అక్కడి నుండి, వైర్లు కలుపుకు - కిందకి దిగేడు.

హాలు మొత్తం ఖాళీ అయ్యింది.

సరళమ్మ భర్త ఆందోళనగా కారు బయటితీసి, అందర్నీ యెక్కించి, స్పీడుగా నడిపేడు, కారు, సిన్మాహాలు దాటి, వీధిలో రోడ్డు మీద కొచ్చింది - పెను ప్రళయ విస్ఫోటనం -- విన్పించింది.!

★ ★ ★

తెల్లవారి, ఊరు విడిచి వెళిపోతూ, కారులో బయల్దేరారు సరళమ్మా, ఆమె భర్త, గవరయ్యా, గున్నమ్మలు... యేడుపు మొహాల్తో మిగిలేరు. కారు కదిలింది.

వీధిరోడ్ల గుండా, గతరాత్రి దగ్ధమయిన సిన్మాహాలు ప్రక్కగా కారు పోతోంది. సరళమ్మ భర్త అటువైపు చూస్తూ -

" పెద్ద, పెద్ద భవంతూలూ, పెద్దనగరాలూ, సినీమాహాల్లూ .అభివృద్ధికీ, నాగరికతకూ సింబల్స్ ! వాటిని విధ్వంసం చేయటం..." తర్వాత పదాలు తొందరగా దొరకలేదు. వాక్యం పూర్తి చేయలేదాయన.

కారు, పట్నందాటి రైల్వేట్రాక్ ప్రక్కగా వెళ్తోంటే... రోడ్డుకి అడ్డంగా ఎర్రటి హెచ్చరిక బోర్డు నిల్చుంది. రోడ్డు మీద పెద్దలోతుగా కంత యేర్పడింది. ఎర్రటి బోర్డు మీద - " రోడ్ అండర్‌రిపేర్, టేక్ డైకర్షన్" అనివుంది.

కారు మలుపు తిప్పి, డైవర్షన్ రోడ్డు మీదుగా, నెమ్మదిగా పోనిచ్చేడాయన, రైల్వేట్రాక్ క్రాస్ చేసిన తర్వాత, మళ్లీ తారురోడ్డు మీదకొచ్చింది కారు.

అప్పటికి, సరళమ్మ ఆలోచనల్లోంచి బయటపడి -

".. విధ్వంసం, నాగరికతా..?" లోగొంతులో నిట్టూర్చింది.

ఆ తర్వాత, మొహంలో ఉద్వేగం చోటుచేసుకుంది.

".... మీరు ఒక్కరాత్రి... సినీమాహాలు విధ్వంసమే చూసారు. నేను యింకెన్నో బయటికి కన్పించని విధ్వంసాలు చూసేను. అందుకే నేను.. రాత్రుళ్లు లెక్కేసాను. నా కళ్లు - నా మెదడుకి ట్రాన్స్‌ఫార్మ్ చేసిన జ్ఞానానికీ, మీ కళ్లు ట్రాన్స్ ఫార్మ్ చేసిన జ్ఞానానికీ తేడా వుంటుంది.

మనమింకా చీకట్లోనే వున్నాం. వెలుతురు కోసం మనం తాపత్రయమూ పడం. చీకటి బతుకులు మనవి..."

సరళమ్మలో అంతదాకా లోలోపల గింగిర్లు తిరిగిన, బదిలీ ఆర్డర్‌తో భర్త వచ్చిన్పటినుండీ.. కల్లోలంగా కదలిన వేదనా, సంవేదనా సారాంశం.. మాటల్లో వ్యక్తమైంది.

ఆ తర్వాత మౌనంగా, కారు వెనకసీటులో వాలిపోయింది.

ఆయన, బలంగా ఏక్సిలేటర్ మీద పాదాన్ని నొక్కేడు. కారు, ఏకంగా వేగాన్నందుకుంది.

బంగాళాఖాతం మీదుగా వీచిన 'యానగాలి' సరళమ్మ ముంగురులను పరామర్శిస్తూ, వీడ్కోలు చెప్తోంది.

*(రచనా కాలం- మే-జూన్ 1997)*